

ర్యాలీని విజయవంతం చేయాలి
ఈనెల 4న సూర్యాపేటలో నిర్వహించే సురక్ష దినోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు.
- 8లో



కేసీఆర్ చేతిలో తెలంగాణ బందీ
కేసీఆర్ కుటుంబం చేతిలో తెలంగాణ బందీ అయిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు.
- 10లో

గరిష్టం/కనిష్టం
44°/29°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

స్వరాష్ట్రంలో సమగ్రాభివృద్ధి



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ తదితరులు



తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సభలో ప్రసంగిస్తున్న మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

- వ్యవసాయ రంగానికి పెద్దపీట
- విద్య, వైద్య, విద్యుత్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- సంక్షేమానికి రూ.వేల కోట్ల నిధులు కేటాయింపు
- రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: గడిచిన తొమ్మిదేళ్లలో సూర్యాపేట జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.34 వేల కోట్లు ఖర్చు చేశామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. అందులో వ్యవసాయరంగానికి దాని అనుబంధ విభాగాలకు పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యా, వైద్య రంగాల్లోనూ విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికారని కొనియాడారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను ప్రారంభించారు. అంతకు ముందు ఆయన పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం మంత్రి జగదీష్‌రెడ్డి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి ప్రసంగించారు. విద్యుత్ రంగంలో కేసీఆర్ తీసుకున్న సంచలనాత్మకమైన నిర్ణయాలతో దేశానికే తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు.

సంక్షేమ రంగాలకు అధిక నిధులు

రైతు పక్షపాతిగా పేరొందిన కేసీఆర్ జిల్లాలో వ్యవసాయం వాటి అనుబంధ రంగాలకు పెద్దపీట వేశారని మంత్రి చెప్పారు. రూ.4,007 కోట్లను వ్యవసాయం, ఉద్యాన రంగాల అభివృద్ధికి వెచ్చించినట్లు వెల్లడించారు. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న నీటిపారుదల, ఆయకట్ల అభివృద్ధికి రూ.2,445.47 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.1,558.18 కోట్లు, మిషన్ భగీరథకు రూ.1,216 కోట్లు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా రూ.22.50 కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా రూ.984.77 కోట్లు, విద్యాశాఖకు రూ.417.82 కోట్లు కేటాయించి అభివృద్ధి సాధించుకున్నామని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం నుంచి రూ.339.28కోట్లు, అదే శాఖ ద్వారా సంక్షేమానికి రూ.138.74 కోట్లు ఖర్చు చేశామన్నారు. గిరిజనాభివృద్ధికి రూ.78.53 కోట్లు, బీసీల అభివృద్ధికి రూ.13.97 కోట్లు, మైనారిటీ సంక్షేమానికి రూ.27.13 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. మహిళా, శిశు సంక్షేమం, వికలాంగులకు రూ.74. 44 కోట్లు, పురపాలకసంఘాల అభివృద్ధికి రూ.556.57 కోట్లు, పట్టణ పేదరిక నిర్మూలనకు రూ.1456.20 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.6180.90 కోట్లను వెచ్చించినట్లు వివరించారు. సూర్యాపేట అభివృద్ధిని పరిశీలిస్తే 2014కు పూర్వం 2014 తరువాత అని చెప్పుకోవాల్సి ఉంటుందన్నారు. శాంతి భద్రతల విషయంలో పోలీసుల పని తీరు భేషుగ్గా ఉందని ప్రశంసించారు. జిల్లా కలెక్టర్ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, శానంపూడి సైదిరెడ్డి, ఎస్పీ రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధిరేటులో తెలంగాణ రికార్డు

కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో 13.02 శాతానికి వృద్ధి రేటు పెరిగిందని మంత్రి జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. అదే సమయంలో దేశ జీడీపీ వృద్ధి రేటు 10.02 శాతానికి తగ్గిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 2017–18 నుంచి 2021–22 సంవత్సరాల మధ్యకాలంలో దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ అత్యధిక తలసరి ఆదాయ వృద్ధి రేటు 11.08 శాతంతో రికార్డు సృష్టించిందన్నారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం తెలంగాణ అని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నీతి ఆయోగ్ నివేదికలో పేర్కొందని తెలిపారు. 2014–15 సంవత్సరంలో రాష్ట్ర వాటా దేశ వృద్ధి రేటులో 4.1 శాతం ఉండగా 2020–21 నాటికి 4.9 శాతానికి పెరిగిందన్నారు. 2015–16 నుంచి 2021–22 వరకు 12.06 శాతంతో సగటున వార్షిక వృద్ధి రేటులో తెలంగాణ మూడవ స్థానంలో ఉందంటూ గణాంకాలే తెలుపుతున్నాయన్నారు.

తెలంగాణ ఏర్పాటు ఘనత సోనియా గాంధీదే..

- డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న

భానుపురి (సూర్యాపేట): నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత నాటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీదేనని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం సూర్యాపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. కొత్త బస్టాండ్ వద్ద సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. 1,200మంది ఆత్మబలిదానాలతో సోనియాగాంధీ చలించిపోయి తెలంగాణను ప్రత్యేక రాష్ట్రం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ.అంజాద్ అలీ, తిరుమలాప్రగడ అనురాధ, కక్కిరేణి శ్రీనివాస్, నాయకులు వేములకొండ పద్మ, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, అబ్దుల్ రహీం, రుద్రంగి రవి, పాలగాని బాలు గౌడ్, పిండిగ విజయ్‌కుమార్, పిడమర్తి మల్లయ్య, అక్కేనపల్లి జానయ్య, నాగుల వాసు, కుందామల్ల శేఖర్, నెల్లుట్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు, నాయకులు

మండుతున్న భానుడు

- మునగాలలో అత్యధికంగా 45.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- అన్ని మండలాల్లోనూ 41 డిగ్రీలకుపైనే..
- వేడి సెగతో తల్లడిల్లుతున్న జనం

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో భానుడు తన ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. రోహిణికార్తె చివరిదశకు రావడంతో భగభగ మండుతున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు హుజూర్‌నగర్ ప్రాంతంలో



సార్లు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ రికార్డులను వెనక్కి నెడుతూ 45.7 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత శుక్రవారం నమోదైంది. జిల్లాలోని మునగాల మండలంలో ఈ ఉష్ణోగ్రతలు నమోదుకాగా.. మరో నాలుగు మండలాల్లోనూ 45 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరగా మిగతా అన్ని మండలాల్లో 41 డిగ్రీలకు పైనే నమోదైంది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం 45 డిగ్రీల ఉష్ణోగ్రత దాటిన ప్రాంతాలను రెడ్ జోన్‌గా ప్రకటిస్తూ హెచ్చరికలు జారీ చేసింది.



ఉదయం 10 గంటలు దాటకముందే..!

కొద్ది రోజులుగా ఉదయం 10 గంటలు దాటకముందే భానుడు భగ్గుమంటున్నాడు. ఈ సమయానికే ఎండ తీవ్రత విపరీతంగా పెరిగిపోతోంది. దీంతో జనం ఇళ్ల నుంచి బయటికి రావాలంటే భయపడుతున్నారు. మోటార్ సైకిళ్లు, ఇతర వాహనాల్లో ప్రయాణించినా వేడి సెగలతో అల్లాడిపోతున్నారు. ఫ్యాన్లు, కూలర్లు ఉన్నప్పటికీ దుకాణాలు, వ్యాపార సముదాయాలు, ఆఫీసుల్లో ఉండలేని పరిస్థితి నెలకొంది. సాయంత్రం 6 గంటలు దాటితేనే రోడ్లపై జన సంచారం కనిపిస్తోంది. మధ్యాహ్నం పట్టణాలు, పల్లెల్లోనూ రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

శుక్రవారం పలు మండలాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రత

ప్రాంతం	డిగ్రీలు
మునగాల	45.7
మఠంపల్లి	45.5
చివ్వెంల	45.3
హుజూర్‌నగర్	45.0
మఠంపల్లి	45.0
పెన్‌పహాడ్	44.5
పాలకవీడు	44.5
అనంతగిరి	44.2
మోతె	44.1

జిల్లా అభివృద్ధికి అహర్నిశలు కృషి

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లా అభివృద్ధికి అధికార యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావు తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్‌తో కలిసి జాతీయ జెండా ఆవిష్కరించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరుతున్నాయన్నారు. జిల్లా అంతటా జరుగుతున్న దశాబ్ది ఉత్సవాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పాఠశాలల పిల్లలకు నోట్ బుక్స్, పెన్నులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, డీపీఓ యాదయ్య, డీఏఓ రామారావు నాయక్, డీహెచ్ఓ శ్రీధర్‌గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్

రాజీ మార్గమే రాజమార్గం : జిల్లా ప్రధాన జడ్జి

చివ్వెంల(సూర్యాపేట): వివిధ కేసుల పరిష్కారం విషయంలో రాజీమార్గమే రాజమార్గం అని జిల్లా ప్రధాన జడ్జి జి.రాజగోపాల్ అన్నారు. శుక్రవారం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యాక్రమంలో భాగంగా ఇన్సూరెన్స్ కంపెనీ, ఆర్టీసీ, బ్యాంకు అధికారులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10న నిర్వహించే జాతీయ మెగాలోక్ అదాలత్‌ను సద్వినయోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కె.కుశ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి సీనపల్లి సోమేశ్వర్, ఆయా శాఖల అధికారులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

నేడు రైతు దినోత్సవం

సూర్యాపేట రూరల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని రైతు వేదికల్లో శనివారం నిర్వహించే రైతు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ సీఈఓ సురేష్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్ కోరారు. సూర్యాపేట మండలం ఎండ్లపల్లి గ్రామంలో శనివారం నిర్వహించబోయే రైతు దినోత్సవ ఏర్పాట్లను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ, డీఏఓ మాట్లాడుతూ ఎండ్లపల్లి గ్రామంలోని రైతు వేదిక వద్ద రైతు దినోత్సవానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జీడి భిక్షం, తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్ దండి సుగుణమ్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెట్రోల్ బంక్‌లో యువకుల వీరంగం

- బంక్ సిబ్బంది, పోలీసులపై దాడి
- ఇద్దరి అరెస్ట్

నూతనకల్: మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో గురువారం సాయంత్రం ఇద్దరు యువకులు వీరంగం సృష్టించారు. బంక్ సిబ్బందితో పాటు పోలీసులపై దాడి చేశారు. బంక్ సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇండియన్ ఆయిల్ బంక్‌లో పెట్రోల్ కొట్టించుకునేందుకు వచ్చిన ఇద్దరు యువకులు బంక్ సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తించి విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. దీంతో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులపై కూడా యువకులు దాడి చేయగా వారిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ హరిప్రసాద్‌ను వివరణ కోరగా.. సూర్యాపేట మండలం యర్కారం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు తప్పతాగి బంక్ సిబ్బందితో పాటు పోలీసులపై దాడి చేయగా వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

వడదెబ్బతో ఒకరు మృతి

పెద్దవూర: వడదెబ్బతో ఓ వ్యక్తి మృతిచెందాడు. పెద్దవూర మండలం నీమానాయక్ తండాకు చెందిన రమావత్ బాలు(33) గురువారం తన వ్యవసాయ పొలంలో పనులు చేయటానికి వెళ్లి మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. విపరీతమైన ఎండలకు వడదెబ్బకు గురై ఇంటికి రాగానే కడుపులో నొప్పి వస్తుందని వాంతులు చేసుకున్నాడు. దీంతో కుటుంబసభ్యులు స్థానిక ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.

వైభవంగా 'దశాబ్ది' పండుగ


సూర్యాపేటలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి


సూర్యాపేటలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి


నల్లగొండలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి


సీఎం కప్ విజేతలైన క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న గుత్తా


యాదాద్రి భువనగిరి జిల్లాలో అమరవీరుల కుటుంబాలను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత


నల్లగొండ కలెక్టరేట్‌లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన


సూర్యాపేటలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల కవాతు


సూర్యాపేటలోని విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం

భూదాన్‌పోచంపల్లి: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బద్దం రాజు(26)కు భార్య తులసి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయన ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా పని సరిగా నడవకపోవడంతో అప్పులు చేశాడు. అంతేకాక మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఇంట్లో కలహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య, తండ్రితో గొడవపడ్డాడు. అనంతరం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు రాత్రి గ్రామంలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గ్రామానికి చెందిన దేవిగారి బాలయ్య అనే రైతు గ్రామశివారులో ఉన్న వ్యవసాయబావి వద్దకు పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్తుండగా అక్కడ చెట్టుకు చొక్కాతో ఉరివేసుకున్న రాజును గమనించాడు. వెంటనే గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


రోదిస్తున్న బంధువులు

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

- పానగల్లులోని ఉదయ సముద్రంలో ప్రమాదం
- మృతుడి స్వస్థలం త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి


నాగరాజు (ఫైల్)

నల్లగొండ క్రైం: పానగల్లులోని ఉదయ సముద్రంలో గురువారం చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. నల్లగొండ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన అంబటి నాగరాజు(30) తన భార్య ప్రశాంతి, ఇద్దరు కుమార్తెలతో కలిసి నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లులో అద్దె ఇంట్లో నివాసముంటూ ఉదయ సముద్రంలో చేపలు పడుతూ జీవనోపాధి పొందుతున్నాడు. గురువారం కూడా అతడు చేపలు పట్టేందుకు తెప్పపై ఉదయ సముద్రంలోకి వెళ్లగా ఈదురుగాలులకు తెప్ప తిరగబడడంతో నీటిలో పడిపోయాడు. ఒడ్డుకు 10ఫీట్ల దూరం వరకు ఈదుకుంటూ వచ్చిన నాగరాజు అప్పటికే అలసిపోయి చెరువులోనే గల్లంతయ్యాడు. తోటి జాలర్లు గమనించి నాగరాజు మృతదేహం కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని గురువారం రాత్రంతా నాగరాజు మృతదేహం వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం ఒడ్డున నాగరాజు మృతదేహం లభ్యమవ్వడంతో పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ప్రశాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చెస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

పెద్దదేవులపల్లిలో విషాదఛాయలు..

త్రిపురారం: అంబటి నాగరాజు మృతితో త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నాగరాజు నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లులో నివాసముంటూ పెద్దదేవులపల్లి గ్రామంలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లో సివిల్ వర్కర్‌గా పనిచేస్తుండేవాడని గ్రామస్తులు పేర్కొన్నారు. దీంతో పాటు నాగరాజు మత్స్యకారుడు కావడంతో అదనపు ఆదాయం కోసం సమయం ఉన్నప్పుడల్లా పానగల్లులోని ఉదయ సముద్రంలో చేపలు పట్టి అమ్మేవాడని తెలిపారు. కాగా శుక్రవారం పెద్దదేవులపల్లిలో నాగరాజు కుటుంబ సభ్యులు అతడి అంత్యక్రియలు నిర్వహించారు. నిరుపేద అయిన నాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని పెద్దదేవులపల్లి మత్స్యకార సంఘం సభ్యులు కోరుతున్నారు.



నకిలీ విత్తనాల దందా!

- నాగపూర్ కేంద్రంగా రూ.కోట్ల వ్యాపారం
- పోలీసుల కళ్లుగప్పి రైతులకు సరఫరా
- చౌటుప్పల్‌లోని నవత ఆగ్రో డివిజన్ దుకాణంపై దాడులు
- 2.2 టన్నుల నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం

చౌటుప్పల్ : వానాకాలం సమీపిస్తుండడంతో నకిలీ విత్తనాల వ్యాపారం చాపకింద నీరులా విస్తరిస్తోంది. టాస్క్‌ఫోర్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నా వ్యాపారులు తమకున్న మార్గాల ద్వారా అక్రమ వ్యాపారానికి తెరలేపుతున్నారు. చౌటుప్పల్‌కు చెందిన ఓ వ్యాపారి గత కొన్నేళ్లుగా పోలీసుల కళ్లుగప్పి రైతులకు నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు దుకాణంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. రూ.60లక్షల విలువ చేసే విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.


నకిలీ పత్తి విత్తనాల బ్యాగులను పరిశీలిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్

పట్టుబడిన విత్తనాలు

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన రావి చంద్రశేఖర్ కొన్నేళ్ల క్రితం చౌటుప్పల్‌కు వచ్చాడు. నవత ఆగ్రో డివిజన్ పేరిట దుకాణం ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్నాడు. ఆయన కుమారుడు ప్రసన్నకుమార్ సైతం ఇదే వ్యాపారంలో ఉన్నాడు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో స్థిరపడిన ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా గారపాడు గ్రామానికి చెందిన గడ్డం రవీంద్రబాబు, చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన నర్సింహులుతో కలిసి ప్రసన్నకుమార్ నకిలీ విత్తనాల దందా సాగిస్తున్నాడు. నిషేధిత బీటీ-3 హెచ్‌టీ విత్తనాలను మహారాష్ట్రతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో నాగపూర్ నుంచి పెద్ద ఎత్తున తీసుకువచ్చిన పత్తి విత్తనాలను చౌటుప్పల్‌లోని గోదాంలో నిల్వ చేశారు. రైతులకు సరఫరా చేసే క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు గురువారం దాడులు నిర్వహించి పట్టుకున్నారు. 2.2 టన్నుల విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు సభ్యులు గల ముఠాలో రవీంద్రబాబు, ప్రసన్నకుమార్‌ను అదుపులోకి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు నర్సింహులు పరారయ్యాడు. రవాణాకు వినియోగిస్తున్న కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన విత్తనాల విలువ రూ.60లక్షల వరకు ఉంటుందని అంచనా. ఎస్‌ఓటీ పోలీసులు ఈ కేసును స్థానిక పోలీసులకు అప్పగించారు. కాగా పట్టుబడిన విత్తనాలను గురువారం హైదరాబాద్‌లో సీపీ డీఎస్ చౌహాన్ సమక్షంలో వ్యవసాయాధికారులు టెస్ట్ చేయగా నకిలీవిగా నిర్ధారణ అయ్యింది.

లాభార్జనే ధ్యేయంగా..


విత్తన దుకాణాల నిర్వాహకులు లాభార్జనే ధ్యేయంగా వ్యాపారం సాగిస్తున్నారు. రైతుల ప్రయోజనాలను విస్మరిస్తూ అక్రమార్జన చేస్తున్నారు. సీజన్ ప్రారంభం అవ్వగానే తనిఖీ బృందాల కళ్లుగప్పి రకరకాల విత్తనాలు తీసుకువచ్చి రైతులకు అంటగడుతున్నారు. చేను ఎదుగుదల, పంటల దిగుబడి వంటి అంశాలను పూర్తిగా విస్మరిస్తున్నారు.

హడావుడిగా తనిఖీలు!

నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేశారు. ఆయా బృందాలు ఎరువులు, విత్తన దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అయినా వ్యాపారులు అధికారుల కళ్లుగప్పి తమ దందా కొనసాగిస్తున్నారు. అధికారులు పక్కాగా తనిఖీలు చేయడం లేదని, దుకాణదారులతో ఉన్న సంబంధాలతో మొక్కుబడిగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

చార్‌ధామ్ యాత్రలో కొండమల్లేపల్లి వాసి మృతి

కొండమల్లేపల్లి: చార్‌ధామ్ యాత్రలో భాగంగా ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని కేదార్‌నాథ్ దర్శనానికి వెళ్లి కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్ మారం మురళి(75) మే 27న మండల కేంద్రానికే చెందిన కండె చంద్రయ్య కుటుంబ సభ్యులతో కలిసి చార్‌ధామ్ యాత్రకు బయల్దేరారు. యాత్ర ప్రారంభమైన నాటి నుంచి తన యోగక్షేమాలు ఫోన్ ద్వారా కుమారుడు వెంకటేశ్వర్లుకు తెలియజేసేవాడు. గురువారం మురళి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుమారుడు వెంకటేశ్వర్లు తన తండ్రి గురించి తెలుసుకునేందుకు కండె చంద్రయ్యకు ఫోన్ చేశాడు. తామంతా గదిలోనే ఉన్నామని, మురళి ఒక్కడే గుర్రంపై కేదార్‌నాథ్ దర్శనానికి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదని ఆయన తెలిపాడు. కాగా శుక్రవారం మధ్యాహ్నం తన తండ్రి మరణించినట్లు తెలిసిందని వెంకటేశ్వర్లు పేర్కొన్నాడు. మృతదేహాన్ని ఇక్కడకు తీసుకురావడం కోసం ఉత్తరాఖండ్ వెళ్తున్నట్లు ఆయన తెలిపారు.


మురళి (ఫైల్)

సురక్ష దినోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలి

- ఎస్పీ రాజేంద్ర ప్రసాద్

సూర్యాపేట క్రైం: సురక్ష దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఈనెల 4న పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ ర్యాలీని విజయవంతం చేయాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ సిబ్బందికి సూచించారు. ర్యాలీ నిర్వహణపై శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లే రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. సమావేశంలో డీఎస్పీలు వెంకటేశ్వరరెడ్డి, నాగభూషణం, రవి, సీఐలు రాజశేఖర్, రామకృష్ణారెడ్డి, తుల శ్రీనివాస్, సోమ్‌నారాయణ్‌సింగ్, ఆంజనేయులు, నాగార్జునగౌడ్, వీరరాఘవులు, రాజేష్‌నాయక్, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్‌తో పాటు బాధ్యతలు పెరుగుతాయి

సూర్యాపేటక్రైం: ప్రమోషన్‌తోపాటు బాధ్యతలు పెరుగుతాయని ఎస్పీ రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం ఏఎస్‌ఐగా ఉద్యోగోన్నతి పొందిన అంజన్ రెడ్డి, వాస కృష్ణ, జానయ్య శ్రీరాములును ఆయన అభినందించారు.


డీఎస్పీ, సీఐలకు సూచనలు చేస్తున్న ఎస్పీ

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం


సత్యనారాయణ రెడ్డి (ఫైల్)

పెద్దవూర: బైక్‌ను కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం పెద్దవూర మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలంలోని చలకుర్తి గ్రామానికి చెందిన మాసిన సత్యనారాయణరెడ్డి(33) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తన బైక్‌పై పెద్దఅడిశర్లపల్లికి వెళ్లి పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా పెద్దవూర మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ సమీపంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే మల్లేపల్లి వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై సత్యనారాయణరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు అవివాహితుడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి.. డివైడర్‌ను ఢీకొట్టి..

కట్టంగూర్: మండలంలోని పామనగుండ్ల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామానికి చెందిన ఎస్. సయ్యద్(26) తన తల్లితో కలిసి బైక్‌పై స్వగ్రామం నుంచి కట్టంగూర్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో పామనగుండ్ల గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో సయ్యద్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు..



ఆలేరురూరల్: ఆలేరు బైపాస్ రోడ్డులో వోల్వో బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆలేరు ఎస్సై వెంకటశ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు బైపాస్ రోడ్డులోని మాడీస్ రెస్టారెంట్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వరంగల్ డిపోకు చెందిన ఆర్టీసీ వోల్వో బస్సు ఢీకొంది. దీంతో అతడి తల, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వీఆర్‌ఏ భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచినట్లు పేర్కొన్నారు.

గళం విప్పిన అసమ్మతి నేతలు

కోదాడ: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కోదాడ పట్టణంలో తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార బీఆర్‌ఎస్‌లో అసమ్మతి నేతలంతా ఒకే వేదికపైకి చేరి ప్రస్తుత ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు టికెట్ ఇస్తే తాము పనిచేయబోమని ప్రకటించారు. అసలు ఆయనకు ఈ దఫా టికెట్టే రాదని చెప్పుకొచ్చారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో చేరిన ప్రస్తుత ఎమ్మెల్యేను గత ఎన్నికల్లో పార్టీ ఆదేశాలతో అందరం కలిసి పని చేసి గెలిపిస్తే ఆయన సొంత పార్టీ నాయకులపైనే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై మంత్రి పిలిచి మాట్లాడితే ప్రస్తుత ఎమ్మెల్యేకు తప్ప ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని చెప్పామని పేర్కొన్నారు. పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గంలో తాను 10 సంవత్సరాలు కష్టపడి 75 వేల పార్టీ సభ్యత్వాలను చేశామని, గత ఎన్నికల్లో చివరి నిమిషంలో పార్టీ ఆదేశించిందని తాను టికెట్ త్యాగం చేస్తే ప్రస్తుత ఎమ్మెల్యే అసలైన తెలంగాణ వాదులను పక్కన పెట్టి కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏర్నేనిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష లక్ష్మీనారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ పాండురంగారావు, చిలుకూరు ఎంపీపీ బండ్ల ప్రశాంతి, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీష, అనంతగిరి జెడ్పీటీసీ కొణతం మధు, ఓయూ జేఏసీ నాయకుడు కందుల మధు, మున్సిపల్ కౌన్సిలర్లు పెండెం వెంకటేశ్వర్లు, తిపిరిశెట్టి సుశీల, గుండపనేని పద్మ, సర్పంచ్ నూకల యుగంధర్‌రెడ్డి, గరిణె కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ శశిధర్‌రెడ్డి

పెళ్లి ఊరేగింపులో బ్లేడ్‌తో దాడి

- బాలుడితో పాటు మరొకరిపై కేసు నమోదు

కోదాడరూరల్: పెళ్లి ఊరేగింపులో బ్లేడ్‌తో దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కోదాడ పట్టణ సీఐ పి. ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురంలో గురువారం రాత్రి ఓ పెళ్లి ఊరేగింపు నిర్వహిస్తుండగా గాంధీనగర్‌కు చెందిన కుడుముల వరుణ్‌తేజ్, మైనర్ అయిన అతడి తమ్ముడికి మరో మైనర్ బాలుడికి మధ్య ఘర్షణ జరిగింది. ఇది మనస్సులో పెట్టుకున్న వరుణ్‌తేజ్, అతడి తమ్ముడు కలిసి మైనర్ బాలుడి బ్లేడ్‌తో దాడి చేయడంతో అతడి గొంతు, ముఖంపై గాయాలయ్యాయి. అక్కడే ఉన్న సదరు బాలుడి తండ్రిపై కూడా దాడి చేయగా అతడికి కూడా స్వల్పగాయాలయ్యాయి. బాలుడి తండ్రి దాసరి మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి వరుణ్‌తేజ్‌ను రిమాండ్‌కు, అతడి తమ్ముడు మైనర్ కావడంతో హైదరాబాద్‌లోని జువైనల్ హోంకు తరలించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

మునగాల(కోదాడ): మండలంలోని మాధవరం గ్రామ శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ పి. లోకేష్ వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన శ్రీనివాస్, లక్ష్మి దంపతులు కోదాడలో శుభకార్యానికి వెళ్లేందుకు బైక్‌పై బయల్దేరారు. మార్గమధ్యలో మునగాల మండలంలోని మాధవరం గ్రామ శివారులో సూర్యాపేట నుంచి కోదాడ వైపు వెళ్లే కారు అతివేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొట్టి ముందు వెళ్తున్న వీరి బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో దంపతులిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఇద్దరిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సంఘటనపై ఇప్పటివరకు తమకు లిఖితపూర్వక ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ పేర్కొన్నారు.

కారులో నగదు చోరీ

బీబీనగర్: సర్పంచ్ భర్త కారు అద్దాలు గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి రూ.1.20లక్షల నగదు, పట్టాదారు పాసుపుస్తకం చోరీ చేసిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ యుగేంధర్ వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలంలోని జమీలాపేట గ్రామ సర్పంచ్ కొమ్మిడి ప్రేమలత భర్త సుభాష్‌రెడ్డి గురువారం బీబీనగర్‌లోని యూనియన్ బ్యాంక్‌కు వచ్చి రూ.1.20 లక్షల నగదు విత్‌డ్రా చేశాడు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చి కారును కార్యాలయం బయట పార్కింగ్ చేశాడు. బ్యాంకు నుంచి సుభాష్‌రెడ్డిని ఫాలో అవుతున్న దుండగులు కారు వద్దకు వచ్చి అద్దాలను పగులగొట్టి రూ.1.20లక్షల నగదు, భూమి పట్టాదారు పాసుపుస్తకం అపహరించుకుపోయారు. సుభాష్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి అనుమానితులను గుర్తించారు.